సినిమా




• ఉగాది స్పెషల్

పచ్చడి తింటాం.. చేయడం రాదు

– శివాని, శివాత్మిక

హైదరాబాద్‌లో ఉంటే అమ్మ, నాన్న, మేమిద్దరం కలిసి పండగ జరుపుకుంటాం. అమ్మ ఉగాది పచ్చడి, గారెలు, పులిహోర, పాయసం .. ఇలా అన్నీ చేస్తుంది. ఒకవేళ మేం చెన్నైలో ఉంటే... అక్కడి మా బంధువులతో పండగ జరుపుకుంటాం. మా ఇద్దరికీ పచ్చడి తినడం తప్ప చేయడం రాదు. మా చిన్నప్పుడు ఇద్దరం ముగ్గులు వేసేవాళ్లం. పండగ అంటే మాకు ముగ్గులే ఎగ్జయిటింగ్. ఇక పండగ రోజున కొత్త బట్టలంటే అది ఆ రోజు మూడ్‌ని బట్టి ఉంటుంది. ఒక్కోసారి ఫుల్ ట్రెడిషనల్‌గా డ్రెస్ చేసుకుంటాం.. చక్కగా నగలు పెట్టుకుని గుడికి వెళతాం. చీర, లంగా, ఓణీ, చుడీదార్.. ఇలా ఏదో ఒకటి ప్రిఫర్ చేస్తాం. ఇప్పుడు చెన్నైలో ఉన్నాం. ఈసారి ఫుల్ ట్రెడిషనల్‌గా రెడీ అవుతాం. ఈ ఉగాది అందరి జీవితాల్లో ఆనందం నింపాలని కోరుకుంటూ.. అందరికీ ఉగాది శుభాకాంక్షలు.

ఇంకా మంచి ఆర్టిస్ట్‌గా గుర్తింపు సంపాదించుకోవాలనుకుంటున్నాను. ఇంకా మంచి నటిగా ఎదగాలని ఉంది. అలాగే మంచి డాక్టర్ అవ్వాలన్నది లక్ష్యం. ప్రస్తుతం ఫైనల్ ఇయర్ మెడిసన్ చేస్తున్నాను. ఏం చేసినా నిబద్ధతతో చేయాలనే నిర్ణయం తీసుకున్నాను. వర్కవుట్, మాటింగ్, చదువు, హార్స్ రైడింగ్.. ఏదైనా మరింత క్రమశిక్షణగా చేయాలనుకుంటున్నాను.
– శివాని

ఈ సంవత్సరం చేతినిండా పని ఉండాలని కోరుకుంటున్నాను. తెలుగు, తమిళంలో సినిమాలు చేయాలనుకుంటున్నాను. అలాగే ఇతర భాషల్లోనూ అవకాశాలు రావాలని కోరుకుంటున్నాను. కెరీర్‌పరంగా ఎదగాలన్నదే ప్రస్తుత లక్ష్యం. వీలైతే ఏదైనా స్పోర్ట్స్ నేర్చుకోవాలని ఉంది. ఏడాది మొత్తం చాలా ప్రశాంతంగా గడిచిపోవాలని ఉంది. ఆరోగ్యం బాగుండాలి.
– శివాత్మిక

ఇది స్టన్నింగ్ షో – రాజమౌళి

ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య నిర్మించిన చిత్రం 'రౌద్రం.. రణం.. రుధిరం' (ఆర్ఆర్ఆర్). ఈ సినిమాలోని 'నాటు నాటు' పాటకు ఆస్కార్ బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో అవార్డు దక్కిన విషయం తెలిసిందే. దీంతో 'నాటు నాటు' పాపులారిటీ మరింత పెరిగిపోయింది. తాజాగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టీజీ విశ్వప్రసాద్ ఆధ్వర్యంలో నార్త్ అమెరికన్ సీమాంధ్ర అసోసియేషన్ సభ్యులు వంశీ కొప్పు రావూరి, ఉజ్వల్ కుమార్ కస్తల న్యూజెర్సీలోని ఎడిసన్ నగరంలో గల పాపియోనా పార్క్‌లో 'నాటు నాటు' పాటకు 150 టెస్లా కార్లతో లైట్ షోను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎడిసన్ నగర మేయర్ సామ్ జోషి, ఆయన బృందం సహకరించారు. ''నాటు నాటు' లైట్ షో సంతోషానిచ్చింది. ఈ షోకు అసోసియేట్ అయిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ఇది స్టన్నింగ్ షో'' అని రాజమౌళి ట్వీట్ చేశారు.


• 'నాటు నాటు' లైట్ షో

భోళా శంకర్ రాక అప్పుడే...


• చిరంజీవి, కీర్తీ సురేష్, తమన్నా

ఉగాదికి ఫ్యాన్స్‌లో పండగ జోష్ నింపారు చిరంజీవి. ఆయన టైటిల్ రోల్‌లో నటిస్తున్న తాజా చిత్రం 'భోళా శంకర్'. తమన్నా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో చిరంజీవి చెల్లెలి పాత్రలో కీర్తీ సురేష్ నటిస్తున్నారు. హీరో సుశాంత్ ఓ ప్రత్యేక పాత్రలో కనిపిస్తారు. క్రియేటివ్ కమర్షియల్స్‌తో కలిసి అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్న చిత్రం ఇది. కాగా 'భోళా శంకర్' సినిమాను ఆగస్టు 11న రిలీజ్ చేయనున్నట్లు ఉగాది సందర్భంగా చిత్ర యూనిట్ ప్రకటించింది. అయితే ఈ సినిమాను తొలుత ఏప్రిల్ 14న విడుదల చేయాలనుకున్న విషయం గుర్తుండే ఉంటుంది. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిషోర్ గరికిపాటి.

మనిషి ప్రాణాలతో ఆడుకోకూడదు

– కోట శ్రీనివాసరావు



''జీవితంలో డబ్బు సంపాదించటానికి చండాలపు పనులు బోలెడున్నాయి.. తప్పుడు వార్తలు రాయక్కర్లేదు. మనిషి ప్రాణాలతో ఆడుకోకూడదు. నేను క్షేమంగానే ఉన్నాను'' అని సీనియర్ నటులు కోట శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ వీడియో రిలీజ్ చేశారు. ''అందరికీ ఉగాది శుభాకాంక్షలు. కోట శ్రీనివాసరావు దుర్మరణం అని సోషల్ మీడియాలో వార్త వేశారట. అలాంటి వార్తల గురించి నాకు తెలియదు. ఉగాది పండగ ఎలా చేయాలి? ఏంటి అనుకుంటుంటే ఉదయం 7:30 గంటల నుంచి ఒక్కటే ఫోన్లు. స్వయంగా యాభై కాల్స్ మాట్లాడాను. బందోబస్తు కోసమని ఓ పదిమంది పోలీసులు నా ఇంటివద్దకు రావడం ఆశ్చర్యంగా అనిపించింది. 'మీరు పెద్దాయన, అందరికీ తెలిసినవారు కదా.. పెద్ద పెద్దవాళ్లు మిమ్మల్ని చూసేందుకు వస్తారని బందోబస్తు కోసం వచ్చాం' అన్నారు. 'ఇలాంటి తప్పుడు వార్తలు రాకుండా దయచేసి మీరే చర్యలు తీసుకోండి, అరికట్టండి.. ఎందుకంటే ఎవరైనా పెద్దవాళ్లు ఉంటే గుండె ఆగి చస్తారు' అని వాళ్లకు చెప్పి పంపించాను. ఇలాంటి తప్పుడు వార్తలు మీరు (ప్రజలు) నమ్మవద్దని మనవి చేస్తున్నాను. అలాగే తప్పుడు వార్తలు రాసే వారిపై ప్రజలు కూడా తిరగబడితే వారికి బుద్ధి వస్తుంది'' అన్నారు కోట శ్రీనివాసరావు.

ఆయన నటనలోని మ్యాజిక్‌ని చూశా!

– ప్రకాశ్‌రాజ్


• కృష్ణవంశీ, ప్రకాశ్ రాజ్, బ్రహ్మానందం

ప్రకాశ్‌రాజ్, రమ్యకృష్ణ, బ్రహ్మానందం ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రంగ మార్తాండ'. కృష్ణవంశీ దర్శకత్వంలో కాలిపు మధు, ఎస్. వెంకట్‌రెడ్డి నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రకాశ్‌రాజ్ మాట్లాడుతూ– ''మరాఠీ 'నటసామ్రాట్' సినిమా చూశాక ఒక కళాకారుడి జీవితంలో ఉన్న బరువు నాకు అర్థం అయింది. ఇలాంటి కథను నేను చూపించాలని అనుకున్నాను. 'నటసామ్రాట్' గురించి కృష్ణవంశీకి చెప్పగానే బాగుందన్నాడు. ఎమోషన్స్ చక్కగా ప్రెజెంట్ చేయగలడని తనని ఈ సినిమా రీమేక్ 'రంగ మార్తాండ'కు దర్శకత్వం వహించమని కోరాను. బ్రహ్మానందంగారితో కలిసి వర్క్ చేయడం వల్ల ఆయన నటనలోని మ్యాజిక్‌ను చూసే అవకాశం దొరికింది'' అన్నారు. ''ప్రకాశ్‌రాజ్ ఈ సినిమా కోసం ప్రాణం పెట్టారు. ఎన్నో సినిమాల్లో నటించిన అనుభవం ఉన్న అద్భుత నటులు బ్రహ్మానందం ఈ సినిమా కోసం కొత్త ఆర్టిస్టులా నటించారు'' అన్నారు కృష్ణవంశీ. 'ఈ చిత్రం క్లయిమాక్స్‌లో ప్రకాశ్‌రాజ్ నట విశ్వరూపం చూస్తారు. ప్రతి సీన్‌ని కృష్ణవంశీ చక్కగా తెరకెక్కించారు'' అన్నారు బ్రహ్మానందం.

ఓ బేబీ జారిపోమాకే...


• కిరణ్, అతుల్య

'హే అందమెట్టి కొట్టావే.. అందనంటూ పోతావే.. గుండెలోన నీ బొమ్మే పెట్టా చూడవే' అంటూ ప్రేయసి కోసం కిరణ్ అబ్బవరం పాట పాడారు. కిరణ్ అబ్బవరం, అతుల్యా రవి జంటగా రమేష్ కడూరి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'మీటర్'. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్‌ల సమర్పణలో చిరంజీవి, హేమలత పెదమల్లు నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 7న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం ఈ సినిమాలోని 'ఓ బేబీ జారిపోమాకే..' అంటూ సాగే లిరికల్ వీడియోను దర్శకుడు అనిల్ రావిపూడి రిలీజ్ చేశారు. సాయి కార్తీక్ స్వరపరచిన ఈ పాటకు బాలాజీ సాహిత్యం అందించగా ధనుంజయ్ పాడారు.

ఆ భయం లేదు!


• ఫరియా

''నటిగా నా జర్నీపై నాకో స్పష్టత ఉంది. అందుకే సినిమాల ఎంపిక విషయంలో నాకు తొందరపాటు లేదు. చాన్స్‌లు వస్తాయా? రావా అనే భయం కూడా లేదు'' అన్నారు ఫరియా అబ్దుల్లా. రవితేజ హీరోగా సుధీర్ వర్మ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'రావణాసుర'. ఈ చిత్రంలో అనూ ఇమ్మాన్యుయేల్, మేఘా ఆకాష్, ఫరియా అబ్దుల్లా, దక్షా నగార్కర్, పూజితా పొన్నాడ హీరోయిన్లుగా నటించారు. రవితేజ, అభిషేక్ అగర్వాల్ నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 7న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఫరియా అబ్దుల్లా మాట్లాడుతూ – ''ఈ చిత్రంలో లాయర్ కనకమహాలక్ష్మి పాత్ర చేశాను. అయితే 'జాతి రత్నాలు'లో చేసిన కామెడీ లాయర్‌లాంటి పాత్ర కాదు. కనకమహాలక్ష్మి సీరియస్‌గా ఉంటుంది. రవితేజగారు నాకు సీనియర్ లాయర్. ప్రస్తుతం తెలుగు, హిందీ, తమిళ్‌లో ఒక్కో సినిమా చేస్తున్నాను'' అన్నారు.

కథ వెనుక కథేంటి?


• సునీల్, విశ్వంత్, అలీ

విశ్వంత్ దుడ్డుంపూడి హీరోగా, శ్రీజిత గొష్, శుభశ్రీ హీరోయిన్లుగా కృష్ణ చైతన్య దర్శకత్వం వహించిన చిత్రం 'కథ వెనుక కథ'. సునీల్, అలీ కీలక పాత్రలు చేశారు. అవనీంద్ర కుమార్ నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ''నా కెరీర్‌లో ఇదొక ప్రయోగాత్మక చిత్రం'' అన్నారు విశ్వంత్. ''భవిష్యత్తులోనూ మా బ్యానర్‌లో కొత్తవారిని ప్రోత్సహిస్తూ సినిమాలు చేస్తాం'' అన్నారు అవనీంద్ర కుమార్. ''సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రమిది'' అన్నారు కృష్ణ చైతన్య. ''నిర్మాతలు బావుంటే ఇండస్ట్రీ బావుంటుంది. ఈ చిత్రాన్ని అందరూ ఆదరించాలి'' అన్నారు అలీ. ''అవనీంద్రలాంటి నిర్మాత దొరకటం కృష్ణ చైతన్య అదృష్టం'' అన్నారు సునీల్.

ఆ నమ్మకంతో రిస్క్ చేశాను – విశ్వక్ సేన్


• 'కరాటే' రాజు, నివేద, విశ్వక్ సేన్

''నేను సినిమాలు చేస్తున్నది డబ్బులు సంపాదించుకోవడానికి కాదు.. సినిమాలు తీయడానికే. 'ధమ్కీ' సినిమాకు చాలా ఖర్చు పెట్టాను. నటనతో పాటు నిర్మాణం, దర్శకత్వం అంశాల్లోనూ చాలా నిజాయితీగా పని చేశాను. ప్రేక్షకులపై నమ్మకంతో చాలా రిస్కులు తీసుకుని నేను చేసిన ఈ సినిమా నా జీవితాన్ని మార్చుతుందనే నమ్మకం ఉంది. ఈ సినిమాలోని సెకండాఫ్‌ను విశ్వక్ మాత్రమే తీయగలడు అనేలా ఉంటుంది. మా నాన్న నన్నెంతో భరించారు. ఆయనకు ఈ సినిమా డబ్బులు తీసుకుని రావాలని కోరుకుంటున్నాను'' అన్నారు నటుడు, దర్శక–నిర్మాత విశ్వక్ సేన్. ఆయన నటించి, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'దాస్ కా ధమ్కీ'. నివేదా పేతురాజ్ హీరోయిన్‌గా నటించారు. కరాటే రాజు (విశ్వక్‌సేన్ తండ్రి) నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో 'కరాటే' రాజు మాట్లాడుతూ– ''బడ్జెట్ మూడింతలు పెరిగినా క్వాలిటీ విషయంలో రాజీ పడలేదు'' అన్నారు.

పబ్లిసిటీ ఇన్‌చార్జ్ ప్రమోద్ కుమార్ ఇక లేరు



తెలుగు పరిశ్రమలో ఎన్నో చిత్రాలకు పబ్లిసిటీ ఇన్‌చార్జ్‌గా చేసిన వీరమాచనేని ప్రమోద్ కుమార్ (87) మంగళవారం విజయవాడలో కన్నుమూశారు. సినీ ఇండస్ట్రీలో 38 ఏళ్ల ప్రయాణంలో 300లకు పైగా చిత్రాలకు పబ్లిసిటీ ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు ప్రమోద్ కుమార్. వాటిల్లో 31 సినిమాలు శతదినోత్సవం జరుపుకున్నాయి. అదే విధంగా కొన్ని చిత్రాల్లో అతిథి పాత్రలు చేశారు. మోహన్‌బాబు హీరోగా 'దొంగ పోలీస్', 'గరం మసాలా' సినిమాలు నిర్మించారు ప్రమోద్ కుమార్. అలాగే 'సుబ్బయ్యగారి మేడ' పేరుతో ఓ చారిత్రక నవల రచించారు. తన సినీ అనుభవాలతో 'తెర వెనుక తెలుగు సినిమా' పేరుతో రాసిన పుస్తకం నంది పురస్కారానికి ఎంపికైంది. ప్రమోద్ కుమార్‌కి కొడుకు వి. శ్రీనివాస్ రాయ్, కుమార్తెలు వై. తులసి రాణి, జి. సరోజ ఉన్నారు. 'ఓ వ్యక్తిగా, కొడుకుగా, భర్తగా, తండ్రిగా ఆయన (ప్రమోద్) తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించారు' అన్నారు వి. శ్రీనివాస్ రాయ్.

భవిత

జాబ్ పాయింట్

నల్సార్ యూనివర్శిటీ, హైదరాబాద్‌లో 58 టీచింగ్ పోస్టులు

హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్శిటీ ఆఫ్ లా.. ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 58
- పోస్టుల వివరాలు: ప్రొఫెసర్(లా, మేనేజ్‌మెంట్)–10, అసోసియేట్ ప్రొఫెసర్(లా, మేనేజ్‌మెంట్)–12,అసిస్టెంట్‌ప్రొఫెసర్(లా, మేనేజ్‌మెంట్, పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్)–33, డైరెక్టర్(డైరెక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్)–01, హెడ్, కార్పొరేట్ ఇంటర్‌ఫేస్–01, ప్లేస్‌మెంట్ ఆఫీసర్–01.
- అర్హత: పోస్టును అనుసరించి పీజీ, ఎంఫిల్, పీహెచ్‌డీ, ఐజీడబ్ల్యూఏ, సీఎంఏ ఉత్తీర్ణుల వ్వాలి. నెట్/స్లెట్/సెట్ అర్హతతోపాటు పని అనుభవం ఉండాలి.
- ఎంపిక విధానం: పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 31.03.2023.
- వెబ్‌సైట్: www.nalsar.ac.in

న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్, హైదరాబాద్‌లో 124 పోస్టులు

హైదరాబాద్‌లోని న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్.. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 124
- పోస్టుల వివరాలు: చీఫ్‌ఫైర్ ఆఫీసర్/ఎ–01, టెక్నికల్ ఆఫీసర్/సి(కంప్యూటర్స్) –03, డిప్యూటీ చీఫ్ ఫైర్ ఆఫీసర్/ఎ–02, స్టేషన్ ఆఫీసర్/ఎ–07, సబ్–ఆఫీసర్ /బి–28, డ్రైవర్–కమ్–పంప్ ఆపరేటర్–కమ్ ఫైర్‌మ్యాన్/ఎ–83.
- అర్హత: పోస్టును అనుసరించి 10+2, సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి. హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి.
- ఎంపిక విధానం: ఖాళీలను అనుసరించి ప్రిలిమినరీ టెస్ట్, అడ్వాన్స్‌డ్ టెస్ట్, ఫిజికల్ అసెస్‌మెంట్ టెస్ట్, కమాండ్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ, డ్రైవింగ్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 10.04.2023.
- వెబ్‌సైట్: www.nfc.gov.in

స్పా విజయవాడలో 14 నాన్ టీచింగ్ పోస్టులు

విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ డైరెక్ట్/డిప్యుటేషన్ ప్రాతిపదికన నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 14
- పోస్టుల వివరాలు: అసిస్టెంట్ రిజిస్ట్రార్(ఫైనాన్స్)–01, జూనియర్ సూపరింటెండెంట్–01, గ్రాఫిక్ డిజైనర్/సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్–01, వర్క్‌షాప్ సూపర్‌వైజర్/సూపరింటెండెంట్–01, జూనియర్ అసిస్టెంట్–09, హాస్టల్ అసిస్టెంట్/కేర్‌టేకర్–01.
- అర్హత: పోస్టును అనుసరించి 10+2, డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: దరఖాస్తును నోటిఫికేషన్ ప్రచురితమైన తేదీ నుంచి 30 రోజుల్లోగా రిజిస్ట్రార్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, ఐటీఐ రోడ్డు, విజయవాడ చిరునామకు పంపించాలి.
- వెబ్‌సైట్: www.spav.ac.in

మెదక్ జిల్లాలో ఫార్మసిస్ట్ పోస్టులు

హైదరాబాద్‌లోని ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్, మెదక్ జిల్లాలోని ఈఎస్ఐ డిస్పెన్సరీలో ఒప్పంద ప్రాతిపదికన ఫార్మసిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 01
- అర్హత: డీ ఫార్మసీ ఉత్తీర్ణులై ఉండాలి.
- వయసు: 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
- వేతనం: నెలకు రూ.31,040 చెల్లిస్తారు.
- ఎంపిక విధానం: విద్యార్హతతో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
- దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును పోస్టులో లేదా వ్యక్తిగతంగా జాయింట్ డైరెక్టర్(మెడికల్), ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్, హైదరాబాద్, ఈఎస్ఐ హాస్పిటల్, సనత్‌నగర్, నాచారం, హైదరాబాద్ చిరునామకు పంపించాలి.
- దరఖాస్తులకు చివరితేది: 27.03.2023.
- వెబ్‌సైట్: www.medak.telangana.gov.in

నారాయణపేట జిల్లాలో 12 స్టాఫ్ నర్సు పోస్టులు

నారాయణపేట జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం నేషనల్ హెల్త్ మిషన్ కింద నారాయణ పేట జిల్లాలోని పీహెచ్‌సీ/డీఎంహెచ్‌వోలలో ఒప్పంద ప్రాతిపదికన స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- మొత్తం పోస్టుల సంఖ్య: 12
- అర్హత: బీఎస్సీ నర్సింగ్/జీఎన్ఎం ఉత్తీర్ణులవ్వాలి.
- వయసు: 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
- వేతనం: నెలకు రూ.29,900 చెల్లిస్తారు.
- ఎంపిక విధానం: బీఎస్సీ నర్సింగ్/జీఎన్ఎంలో సాధించిన మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం, సింగారం ఎక్స్–రోడ్, నారాయణపేట చిరునామకు పంపించాలి.
- దరఖాస్తులకు చివరితేది: 29.03.2023.
- వెబ్‌సైట్: www.narayanpet.telangana.gov.in

సైన్స్‌లో బోధన,పరిశోధనలకు మార్గం.. సీఎస్ఐఆర్ నెట్

- సీఎస్ఐఆర్–యూజీసీ నెట్ డిసెంబర్ 2022/ జూన్ 2023 ప్రకటన
- ఈ స్కోర్‌తో జేఆర్ఎఫ్, లెక్చర్‌షిప్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా అర్హత
- బ్యాచిలర్, పీజీ ఉతీర్ణులకు దరఖాస్తుకు అవకాశం

జాయింట్ సీఎస్ఐఆర్–యూజీసీ నెట్! ఇది కేంద్ర విద్యాశాఖ పరిధిలోని.. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్(సీఎస్ఐఆర్), యూజీసీ(యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్).. సంయుక్తంగా నిర్వహించే పరీక్ష!! ఇందులో అర్హత సాధిస్తే పీహెచ్‌డీలో చేరే అవకాశంతోపాటు ఆర్థిక ప్రోత్సాహకాలు కూడా లభిస్తాయి. దీంతోపాటు బోధన రంగంలో అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయి. తాజాగా సీఎస్ఐఆర్–యూజీసీ నెట్–డిసెంబర్ 2022, జూన్–2023లకు ఉమ్మడి నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో సీఎస్ఐఆర్–యూజీసీ నెట్ వివరాలు, అర్హతలు, పరీక్ష విధానం, విజయం సాధిస్తే లభించే ప్రయోజనాలు తదితర వివరాలు..

సైన్స్ పరిశోధనలపై యువతకు ఆసక్తి పెరుగుతోంది. బోధన రంగంలో రాణించాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఒకే సమయంలో ఈ రెండు అవకాశాలను అందుకునేందుకు మార్గం.. సీఎస్ఐఆర్–యూజీసీ నెట్. ఈ పరీక్షలో విజయం సాధించిన అభ్యర్థులు సీఎస్ఐఆర్ పరిధిలోని విశ్వవిద్యాలయాల్లో, పరిశోధన కేంద్రాల్లో పీహెచ్‌డీకి దరఖాస్తు చేసుకోవచ్చు. ఆయా పరిశోధన సంస్థల్లో.. పీహెచ్‌డీ చేసేందుకు జేఆర్ఎఫ్(జూనియర్ రీసెర్చ్ ఫెలో) లభిస్తుంది. అధ్యాపక వృత్తిలో అడుగు పెట్టాలనుకునే వారికి లెక్చరర్‌షిప్ లేదా అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్ పేరుతో అర్హత లభిస్తుంది. కెమికల్ సైన్సెస్; ఎర్త్, అట్మాస్పియరిక్ సైన్సెస్, ఓషియన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్; లైఫ్ సైన్సెస్; మ్యాథమెటికల్ సైన్సెస్; ఫిజికల్ సైన్సెస్.. ఇలా ఐదు విభాగాల్లో సీఎస్ఐఆర్ యూజీసీ నెట్‌ను నిర్వహిస్తున్నారు.


సీఎస్ఐఆర్–యూజీసీ నెట్

అర్హతలు

- కనీసం 55 శాతం మార్కులతో ఎమ్మెస్సీ, ఇంటిగ్రేటెడ్ బీఎస్–ఎంఎస్, నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ సైన్స్,బీఈ/బీటెక్/బీఫార్మసీ/ఎంబీబీఎస్, బీఎస్సీ ఆనర్స్ ఉత్తీర్ణులు అర్హులు. ఆయా కోర్సుల చివరి సంవత్సరం విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. రిజర్వ్‌డ్ కేటగిరీ విద్యార్థులు సంబంధిత కోర్సుల్లో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. బీఎస్సీ(హానర్స్) ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు. కానీ ఫైనల్ విద్యార్థులు/ఫలితాల కోసం ఎదురుచూస్తున్న వారికి అర్హత లేదు.
- బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులకు లెక్చరర్‌షిప్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్‌లకు అర్హత లేదని పేర్కొన్నారు.

వయసు

జేఆర్ఎఫ్ అభ్యర్థులకు వయసు జూలై 1, 2022 నాటికి 28 ఏళ్లలోపు ఉండాలి. ఎస్సీ,ఎస్టీ,పీడబ్ల్యూడీ వర్గాల వారికి అయిదేళ్లు, ఓబీసీ వర్గాల వారికి మూడేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది. లెక్చరర్‌షిప్,అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్ అభ్యర్థులకు ఎలాంటి వయో పరిమితి నిబంధన లేదు.

జేఆర్ఎఫ్/అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్

- సీఎస్ఐఆర్–యూజీసీ నెట్ ద్వారా పీహెచ్‌డీ చేసేందుకు అవకాశం కల్పించే జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్(జేఆర్ఎఫ్) లభిస్తుంది. అదే విధంగా కళాశాలల్లో అధ్యాపకులుగా పనిచేసేందుకు వీలుగా లెక్చరర్‌షిప్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్‌లను కేటాయిస్తారు. అభ్యర్థులు దరఖాస్తు సమయంలోనే తమ ప్రాధాన్యం జేఆర్ఎఫ్ లేదా లెక్చరర్‌షిప్ తెలియజేయాలి.
- ఫలితాల వెల్లడి సందర్భంగా జేఆర్ఎఫ్ మెరిట్ లిస్ట్, లెక్చరర్‌షిప్/అసిస్టెంట్ ప్రొఫెసర్‌షిప్ మెరిట్ లిస్ట్ పేరుతో రెండు జాబితాలను విడుదల చేస్తారు. జేఆర్ఎఫ్‌కు ఎంపికైన వారికి పరిశోధన లేబొరేటరీలు, ఐఐటీలు, ఎన్ఐటీలలో పీహెచ్‌డీ చేసే అవకాశం లభిస్తుంది. లెక్చరర్‌షిప్ పొందిన అభ్యర్థులకు యూజీసీ నిబంధనల ప్రకారం–కళాశాలల్లో అధ్యాపకులుగా చేరేందుకు ఆమోదం లభిస్తుంది.
- జేఆర్ఎఫ్‌కు ఎంపికైతే తొలి రెండేళ్లు నెలకు రూ.31 వేలు చొప్పున ఫెలోషిప్; ఆ తర్వాత మూడేళ్లు నెలకు రూ.35వేల ఎస్ఆర్ఎఫ్(సీనియర్ ఫెలోషిప్) అందుతుంది.
- యూజీసీ మార్గదర్శకాల ప్రకారం–ఉన్నత విద్యా సంస్థల్లో లెక్చరర్స్, అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకాల్లో సీఎస్ఐఆర్–యూజీసీ నెట్ ఉత్తీర్ణత ప్రామాణికం.

పరీక్ష మూడు విభాగాలుగా

సీఎస్ఐఆర్–యూజీసీ నెట్ పరీక్ష.. ఐదు సబ్జెక్టుల్లో మూడు విభాగాల్లో మూడు గంటల వ్యవధిలో ఉంటుంది. మొత్తం మార్కులు రెండు వందలు. వివరాలు..

కెమికల్ సైన్సెస్

పార్ట్ సబ్జెక్ట్	ప్రశ్నలు	ప్రతి ప్రశ్నకు మార్కులు	మొత్తం మార్కులు
ఎ జనరల్ ఆప్టిట్యూడ్	20	2	30
బి సబ్జెక్ట్ పేపర్	40	2	70
సి సబ్జెక్ట్ పేపర్–2	60	4	100

(పార్ట్–ఎలో 15 ప్రశ్నలు, పార్ట్–బిలో 35 ప్రశ్నలు, పార్ట్–సిలో 25 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి)

ఎర్త్, అట్మాస్పియరిక్, ఓసియన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్

పార్ట్ సబ్జెక్ట్	ప్రశ్నలు	ప్రతి ప్రశ్నకు మార్కులు	మొత్తం మార్కులు
ఎ జనరల్ ఆప్టిట్యూడ్	20	2	30
బి సబ్జెక్ట్ పేపర్	50	2	70
సి సబ్జెక్ట్ పేపర్–2	80	4	100

(పార్ట్–ఎలో 15 ప్రశ్నలు, పార్ట్–బిలో 35 ప్రశ్నలు, పార్ట్–సిలో 25 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి)

లైఫ్ సైన్సెస్

పార్ట్ సబ్జెక్ట్	ప్రశ్నలు	ప్రతి ప్రశ్నకు మార్కులు	మొత్తం మార్కులు
ఎ జనరల్ ఆప్టిట్యూడ్	20	2	30
బి సబ్జెక్ట్ పేపర్	50	2	70
సి సబ్జెక్ట్ పేపర్–2	75	4	100

(పార్ట్–ఎలో 15 ప్రశ్నలు, పార్ట్–బిలో 35 ప్రశ్నలు, పార్ట్–సిలో 25 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి)

మ్యాథమెటికల్ సైన్సెస్

పార్ట్ సబ్జెక్ట్	ప్రశ్నలు	ప్రతి ప్రశ్నకు మార్కులు	మొత్తం మార్కులు
ఎ జనరల్ ఆప్టిట్యూడ్	20	2	30
బి సబ్జెక్ట్ పేపర్	40	3	75
సి సబ్జెక్ట్ పేపర్–2	60	4.75	95

(పార్ట్–ఎలో 15 ప్రశ్నలు, పార్ట్–బిలో 25 ప్రశ్నలు, పార్ట్–సిలో 20 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి)

ఫిజికల్ సైన్సెస్

పార్ట్ సబ్జెక్ట్	ప్రశ్నలు	ప్రతి ప్రశ్నకు మార్కులు	మొత్తం మార్కులు
ఎ జనరల్ ఆప్టిట్యూడ్	20	2	30
బి సబ్జెక్ట్ పేపర్	25	3.5	70
సి సబ్జెక్ట్ పేపర్–2	30	5	100

(పార్ట్–ఎలో 15 ప్రశ్నలు, పార్ట్–బిలో 20 ప్రశ్నలు, పార్ట్–సిలో 20 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి)

విజయం సాధించాలంటే

పార్ట్–ఎ

ఇది అయిదు కేటగిరీల అభ్యర్థులకు ఉమ్మడి విభాగం. ఇందులో జనరల్ ఆప్టిట్యూడ్‌ను పరీక్షించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. తార్కిక విశ్లేషణ, న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ ఎబిలిటీ, పజిల్స్ తదితర అంశాలపై దృష్టి పెట్టాలి. అదే విధంగా బేసిక్ జనరల్ నాలెడ్జ్/కరెంట్ అఫైర్స్ అంశాలపైనా అవగాహన ఏర్పరచుకోవాలి.

పార్ట్–బి

ఈ విభాగంలో అభ్యర్థులు ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్ నుంచి ప్రశ్నలు ఉంటాయి. ఇవి పూర్తిగా మల్టిపుల్ ఛాయిస్ విధానంలో ఉంటాయి. అభ్యర్థులు తమ అకడమిక్ పుస్తకాలను పూర్తిగా అధ్యయనం చేయడం, అన్వయ దృక్పథంతో ప్రాక్టీస్ చేయడం ద్వారా ఇందులో మార్కులు పొందొచ్చు.

పార్ట్–సి

ఈ విభాగంలోనూ అభ్యర్థులు ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్ సంబంధిత ప్రశ్నలే ఉంటాయి. వీటి క్లిష్టత స్థాయి అధికంగా ఉంటుంది. అభ్యర్థుల్లోని శాస్త్రీయ భావనలపై అవగాహన, శాస్త్రీయ భావనలను అన్వయించే నైపుణ్యాలను పరీక్షిస్తారు. పూర్తిగా విశ్లేషణాత్మక దృక్పథంతో సమాధానాలను గుర్తించాల్సిన విధంగా ప్రశ్నలు ఉంటాయి.

పీజీ స్థాయి అవగాహన

సీఎస్ఐఆర్–యూజీసీ అభ్యర్థులు తాము ఎంపిక చేసుకున్న సబ్జెక్టులలో పీజీ స్థాయిలో పూర్తి అవగాహన పొందాలి. ముఖ్యంగా రీసెర్చ్ ఓరియెంటేషన్‌తో ప్రిపరేషన్ సాగించాలి. పార్ట్–సిలో రాణించేందుకు ఈ విధానం దోహదపడుతుంది. పార్ట్–ఎలో అడిగే జనరల్ ఆప్టిట్యూడ్‌కు సంబంధించి కూడా శాస్త్ర, సాంకేతిక రంగాల్లో తాజా పరిశోధనలు, వాటి ఫలితాలు, సంబంధిత శాస్త్రవేత్తల గురించి తెలుసుకోవాలి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: ఏప్రిల్ 10, 2023
- ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం: ఏప్రిల్ 12–18, 2023
- సీఎస్ఐఆర్–యూజీసీ నెట్ తేదీలు: జూన్ 6, 7, 8, 2023
- వెబ్‌సైట్: https://csirnet.nta.nic.in

55.744 టీఎంసీలు
సోమశిల: జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 55.744 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయం నుంచి కండలేరుకు 50 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నారు.

బంగారం ధరలు

24 క్యారెట్లు(10 గ్రాములు) -	రూ.61,050
22 క్యారెట్లు ఆర్నమెంట్(గ్రాము) -	రూ.5,453
3 శాతం జీఎస్టీతో.. -	రూ.5,617
సవర(8 గ్రా) -	రూ.44,936

వాతావరణం
గరిష్టం/కనిష్టం 33.4 /24.7
వాతావరణంలో తేమ 76 శాతం ఉంది. జిల్లావ్యాప్తంగా బుధవారం కొన్ని మండలాల్లో తేలికపాటి జల్లులు కురుస్తాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

ఎంఫార్మసీ విద్యార్థినికి స్వర్ణ పతకం


లక్ష్మీరమణి

ఉదయగిరి: మండలంలోని తిరుమలాపురానికి చెందిన శనివారపు వెంకటేశ్వరరెడ్డి – పండరీకుమారి దంపతుల కుమార్తె లక్ష్మీరమణి ఎంఫార్మసీలో యూనివర్సిటీ స్థాయిలో ప్రథమస్థానం సాధించి స్వర్ణ పతకం అందుకుంది. తిరుపతి మోహన్‌బాబు యూనివర్సిటీలోని శ్రీవిద్యానికేతన్ కాలేజ్‌ఆఫ్ ఫార్మసీలో 2022లో ఎంఫార్మసీ చేసి యూనివర్సిటీ ఫస్ట్ ర్యాంకు సాధించగా ఆమెకు శ్రీకలసాని ధర్మరాజులు మెమోరియల్ సంస్థ సోమవారం యూనివర్సిటీలో స్వర్ణ పతకం అందజేసింది.

అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్‌గా సుకేశ్వర్‌రెడ్డి


సుకేశ్వర్‌రెడ్డి

చేజర్ల: ఈ నెల 18న వెలువడిన ఎస్‌ఎస్‌సీ కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ 2021–22 పరీక్ష ఫలితాల్లో చేజర్లకు చెందిన కొండా సుకేశ్వర్‌రెడ్డి ఆల్ ఇండియాలో 95వ ర్యాంక్ సాధించి అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్(ఈడీ)గా సెలెక్ట్ అయ్యారని అతని తాత వంగవరపు నారసింహారెడ్డి మంగళవారం చేజర్లలో తెలిపారు. సుకేశ్వర్‌రెడ్డి 2020–21 ఫలితాల్లో 1730వ ర్యాంక్ సాధించి 2022 డిసెంబర్ నుంచి చెన్నైలో కస్టమ్స్ ప్రివెంట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. ఆ తర్వాత ఎస్‌ఎస్‌సీ(2021–2022) పరీక్షలో ఆల్ ఇండియా 95వ ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా సుకేశ్వర్‌రెడ్డి తల్లిదండ్రులు రాజేశ్వర్‌రెడ్డి, నీరజ దంపతులు ఆనందం వ్యక్తం చేశారు.

పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో మంగళవారం 637 పొగాకు బేళ్లు విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 656 బేళ్లు రాగా వాటిలో 637 బేళ్లను విక్రయించామన్నారు. మిగిలిన బేళ్లలో ఎన్‌ఎస్ 3, ఎన్‌బీ 4, సీఆర్ 11, ఒకటి బీఆర్‌గా గుర్తించామని తెలిపారు. వేలంలో 84,658 కిలోల పొగాకు విక్రయం కాగా రూ.1,66,59,621 వ్యాపారం జరిగింది. గరిష్ట ధర కిలో ఒక్కింటికి రూ.200 కాగా, కనిష్ట ధర రూ.185 లభించింది. మొత్తం మీద సగటు ధర కిలో ఒక్కింటికి రూ.196.79గా నమోదైంది.

పోర్టుకు సహకారం అందిస్తాం


వేబ్రిడ్జిని ప్రారంభిస్తున్న జాన్ ప్రసాద్

ముత్తుకూరు: అదానీ కృష్ణపట్నంపోర్టుకు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తామని సౌత్ సెంట్రల్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ జీజే జాన్ ప్రసాద్ అన్నారు. వెంకటాచలం రోడ్ కూడలిలో మంగళవారం నూతన ఎలక్ట్రానిక్ ఇన్ మోషన్ వేబ్రిడ్జిని ఆయన ప్రారంభించారు. అనంతరం పోర్టు ప్రైవేట్ సైడింగ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా పోర్టు సీఈఓ జీజే రావుతో పోర్టు పనితీరు, ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. కోల్ లోడింగ్‌లో 2014–15 సంవత్సర రికార్డును అధిగమిస్తూ 2022–23 ఆర్థిక సంవత్సరంలో సాధించిన నూతన రికార్డును ప్రశంసించారు.

పల్లె ముంగిట సంపద

పల్లెలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు ప్రజారోగ్యాన్ని సంరక్షించే లక్ష్యంతో పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. గ్రామాల్లో ఇళ్లలో వెలువడిన చెత్తను క్లాప్ మిత్రలు ఇంటింటికీ వెళ్లి సేకరించి సంపద కేంద్రాలకు తరలిస్తున్నారు. ఘన వ్యర్థాల నిర్వహణను ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నారు. ఆ చెత్త నుంచి వర్మీకంపోస్టును తయారు చేసి రైతులకు విక్రయిస్తున్నారు. తద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరుతోంది. ఈ కేంద్రాలకు అవసరమైన వనరులు, వాహనాలు, పరికరాలను ప్రభుత్వం ఆయా పంచాయతీలకు అందజేసి గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది.

- పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్మాణం
- పరిశుభ్రతతోపాటు ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- తడి, పొడి చెత్తలుగా వేరు చేసి వర్మీకంపోస్టు తయారీ
- సంపద కేంద్రాలతో సమకూరిన ఆదాయ వనరులు
- తద్వారా వచ్చిన ఆదాయంతో క్లాప్ మిత్రలకు వేతనాలు



నెల్లూరు రూరల్‌లోని కాకుపల్లిలో ఏర్పాటైన సందప తయారీ కేంద్రం

నెల్లూరు(పొగతోట): రాష్ట్రంలోని పంచాయతీల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. గ్రామాల పరిశుభ్రత, ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. అందులో భాగంగానే పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల ప్రజల ఆరోగ్యం మెరుగుపడడంతోపాటు పంచాయతీలకు ఆదాయం సమకూరుతోంది. జిల్లాల విభజన అనంతరం 722 పంచాయతీలు జిల్లాలో ఉండగా ఇప్పటివరకు 488 చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిర్మించింది.

ప్రణాళికాబద్ధంగా నిర్వహణ

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంపద కేంద్రాలను పూర్తిస్థాయిలో నిర్మించేలా చర్యలు చేపట్టింది. ప్రజారోగ్యాన్ని మెరుగుపరచడం, ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించాలనే లక్ష్యంతో జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించి దానిని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలకు తరలించే ఏర్పాట్లు చేసింది. చెత్త సేకరణ కోసం జిల్లావ్యాప్తంగా 1800 మంది క్లాప్ మిత్రలను ప్రభుత్వం నియమించింది. వారు గ్రామాల్లో ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తలను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలిస్తున్నారు. చెత్త నుంచి ఘన వ్యర్థాల నిర్వహణను ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా 38 చెత్త తరలింపు వాహనాలు, 818 ట్రై సైకిళ్లు, 659 ఫాగింగ్ మెషీన్లు, 722 ఇన్సినిరేటర్లు, 559 హైపైజర్ టాయిలెట్ క్లీనర్స్‌ను అందించింది. అంతేకాకుండా సంపద కేంద్రాల వద్దకు అవసరమైన రోడ్లు, నీరు వనరులు, విద్యుత్ సదుపాయం, మరుగుదొడ్లను ఏర్పాటు చేసింది.

వర్మీకంపోస్టుతో ఆదాయం

సంపద కేంద్రాల్లో తడి, పొడి చెత్తల ద్వారా నాణ్యమైన వర్మీకంపోస్టును తయారు చేసి కేజీ రూ.10 చొప్పున రైతులకు విక్రయిస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాలోని కేంద్రాల్లో సుమారు 400 టన్నులకు పైగా వర్మీకంపోస్టును తయారు చేయగా, 60 టన్నులకుపైగా విక్రయించారు. అలాగే చెత్తలోని ప్లాస్టిక్ సామగ్రిని విక్రయించడం, కేంద్రాల్లో పండించిన ఆకుకూరలు, కూరగాయలు, పండ్లను విక్రయిస్తున్నారు. మొత్తమ్మీద ఈ విక్రయాల ద్వారా రూ.20 లక్షలకుపైగా ఆదాయం సమకూరింది. అంతేకాకుండా గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ప్రతి శుక్రవారం పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రోడ్లకిరువైపులా చెత్త లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. మురుగునీరు రోడ్లపై ప్రవహించకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. డీఎల్‌పీఓలు, ఈఓపీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్య కార్యక్రమాలను నిత్యం పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో జగనన్న స్వచ్ఛసంకల్పం కార్యక్రమాల నిర్వహణకు, ఫిర్యాదుల స్వీకరణకు మండల, జిల్లా స్థాయిల్లో కమాండ్ కంట్రోల్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ప్రజలు పారిశుద్ధ్యంపై ఫిర్యాదులు చేయవచ్చు.

జిల్లాలో..

పంచాయతీలు 722	ఇప్పటివరకు తయారైన వర్మీకంపోస్టు - సుమారు 400 టన్నులు
పూర్తిస్థాయిలో నిర్మించిన సంపద కేంద్రాలు 488	
చెత్త సేకరణకు నియమించిన క్లాప్ మిత్రలు 1800 మంది	విక్రయించింది 60 టన్నులు
సమకూరిన ఆదాయం - రూ.20 లక్షలకుపైనే..	

పరిశుభ్రంగా గ్రామాలు



జగనన్న స్వచ్ఛసంకల్పం కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపడుతున్నాం. ప్రతి ఇంటి నుంచి సేకరించిన చెత్తను తరలించి వేరు చేసి వర్మీకంపోస్టు తయారు చేస్తున్నాం. వర్మీకంపోస్టును విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరుతోంది. ఇప్పటివరకు రూ.20 లక్షల ఆదాయం వచ్చింది.
– బి.చిరంజీవి, డీపీఓ

క్లాప్ మిత్రలకు వేతనాలు

పంచాయతీల్లో సంపద కేంద్రాల ద్వారా సమకూరిన ఆదాయంతో క్లాప్ మిత్రలకు వేతనాలు చెల్లించేలా అధికారులు చర్యలు చేపట్టారు. క్లాప్ మిత్రలు కేంద్రాల్లో కూరగాయలు, పండ్ల మొక్కలు పెంచి వాటిని విక్రయిస్తున్నారు. వీటి ద్వారా కూడా పంచాయతీకి ప్రతి సంవత్సరం రూ.2.50 లక్షల నుంచి రూ.3 లక్షల ఆదాయం వచ్చేలా అధికారులు చర్యలు చేపట్టారు.

సింహపురిలో ఉగాది ఉషస్సులు


విద్యుద్దీపాలంకరణలో ఇరుకళల పరమేశ్వరి ఆలయం


నెల్లూరులో ముందస్తు ఉగాది వేడుకలు జరుపుకుంటున్న మహిళలు

నెల్లూరు(బృందావనం): శోభకృత్ నామ తెలుగు సంవత్సరాదిని బుధవారం జరుపుకోనున్న నేపథ్యంలో నగరంలో ఉగాది సందడి నెలకొంది. నగరంలోని ఏసీ కూరగాయల మార్కెట్, ఆత్మకూరు బస్టాండ్, మద్రాస్ బస్టాండ్, పెద్దబజారు, చిన్నబజారు తదితర ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం నుంచి పండగకు అవసరమైన పూజాసామగ్రి కొనుగోలు చేసేందుకు పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు. దీంతో నగరంలోని ప్రధాన కూడళ్లన్నీ రద్దీగా మారాయి. ఉగాది మహోత్సవం సందర్భంగా సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయం విద్యుద్దీపాల అలంకరణతో శోభిల్లింది. ఉగాది సందర్భంగా ఆలయాలకు తరలివచ్చే భక్తుల కోసం ఆయా దేవస్థానాల్లో ధర్మకర్తల మండళ్లు, కార్యనిర్వహణాధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కొందరు ముందస్తు వేడుకలు జరుపుకున్నారు.

పౌష్టికాహారంగా రాగి జావ

- కలెక్టర్ చక్రధర్‌బాబు


రాగిజావను విద్యార్థినికి అందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, పక్కన కలెక్టర్ చక్రధర్‌బాబు, ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి

నెల్లూరు(అర్బన్): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్న లక్ష్యంతో జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా రాగిజావను ప్రభుత్వం అందిస్తోందని కలెక్టర్ కేవీఎస్ చక్రధర్‌బాబు తెలిపారు. జగనన్న గోరుముద్ద పథకం ద్వారా వారానికి మూడు రోజులపాటు రాగిజావను విద్యార్థులకు అందించే కార్యక్రమాన్ని మంగళవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని తమ క్యాంపు కార్యాలయంలో ప్రారంభించారు. అనంతరం అన్ని జిల్లాల కలెక్టర్లు, విద్యాశాఖాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నెల్లూరు కలెక్టరేట్ నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ చక్రధర్‌బాబుతోపాటు కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, డీఈఓ గంగాభవాని, సమగ్ర శిక్ష ఏపీఓ ఉషారాణి తదితరులు హాజరయ్యారు. సీఎం వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య, సంక్షేమ రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. గోరుముద్ద పథకంలో ఎప్పటికప్పుడు మెనూ మార్పు చేస్తూ విద్యార్థులకు సంపూర్ణ పోషణ అందించేందుకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని 2,590 పాఠశాలల్లో 1,81,327 మంది విద్యార్థులకు రాగిజావ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం రాగిజావను కందుకూరు ఎమ్మెల్యే మహీధర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ పలువురు విద్యార్థులకు స్వయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగస్వాములైన ఇస్కాన్ ట్రస్ట్, శ్రీసత్యసాయి బాబా ట్రస్ట్ వారికి ధన్యవాదాలు తెలిపారు. ఇస్కాన్ ట్రస్ట్ ప్రతినిధి స్వామిచంద్రకేశవ దాస్, పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత


మాట్లాడుతున్న ఫారెస్ట్ రేంజర్ రామకొండారెడ్డి

ఆత్మకూరు: అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని ఆత్మకూరు ఫారెస్ట్ రేంజర్ కె.రామకొండారెడ్డి అన్నారు. స్థానిక అటవీశాఖ కార్యాలయ ఆవరణలో మంగళవారం వన్యప్రాణులు, ఎర్రచందనం సంరక్షణపై అవగాహన సమావేశం, శిక్షణ తరగతులు నిర్వహించారు. పలు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, వన సంరక్షణ సమితి సభ్యులు పాల్గొన్న ఈ సమావేశంలో రేంజర్ మాట్లాడుతూ అటవీ సంపదను కొల్లగొడుతున్న, అడవులకు నిప్పు పెడుతున్న వారిని గుర్తించి సమాచారం ఇవ్వాలని కోరారు. గ్రామాలకు దగ్గరగా ఉన్న అటవీ ప్రాంతాన్ని కాపాడాల్సిన బాధ్యత ఆయా గ్రామస్తులు, వీఎస్ఎస్ సభ్యులపై ఉందన్నారు. రేంజ్ పరిధిలోని 6 వేల హెక్టార్లలో నూతన ప్లాంటేషన్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అటవీ చట్టాలపై అడ్వకేట్ విజయ్‌కుమార్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓలు పిచ్చిరెడ్డి, రవి, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు పెంచలనరసయ్య, వాగాల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సేవలు స్ఫూర్తిదాయకం


ఉగాది పురస్కారం అందజేస్తున్న కలెక్టర్ చక్రధర్‌బాబు తదితరులు

నెల్లూరు(బృందావనం): రోటరీ క్లబ్ నెల్లూరు వారు చేపడుతున్న సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని కలెక్టర్ చక్రధర్‌బాబు అన్నారు. రోటరీ క్లబ్, నెల్లూరు ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్‌స్టేషన్ వద్ద ఉన్న ఏనుగు సుందరరామిరెడ్డి ఆడిటోరియంలో మంగళవారం రాత్రి పలువురికి 'రోటరీ ఒకేషనల్ అవార్డులు – శ్రీశోభకృత్ నామ సంవత్సర ఉగాది పురస్కారాలు–2023' అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ కేవీఎస్ చక్రధర్‌బాబు హాజరయ్యారు. వివిధ రంగాల్లో ఉత్తమ సేవలందించిన 20 మందికి ఆ క్లబ్ ప్రెసిడెంట్, సెక్రటరీలు కొండాశేఖర్‌రెడ్డి, ఎం.డి.సమీవుల్లా ఆధ్వర్యంలో పురస్కారాలను అందజేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో 3160 రోటరీ జిల్లా గవర్నర్ వొమ్మిన నాగసతీష్, మాజీ గవర్నర్ దొడ్లభరత్ కుమార్‌రెడ్డి, గౌరవ అతిథులుగా పాల్గొన్నారు.

భూఆక్రమణదారులపై కేసులు నమోదు

నెల్లూరు(క్రైమ్): భూ ఆక్రమణలకు యత్నిస్తున్న వారిపై నెల్లూరు రూరల్ తహసీల్దార్ ఫిర్యాదు మేరకు వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. అంబాపురంలోని 10.38 ఎకరాల ప్రభుత్వ భూమి విషయమై కొన్నేళ్లుగా హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉంది. ఈ నెల ఒకటిన అంబాపురం ఎస్సీకాలనీకి చెందిన వివిధ కుటుంబాలు గుడిసెలు వేసేందుకు యత్నించగా పోలీసుల సహకారంతో రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా 145 సీఆర్పీసీ ఉత్తర్వులను తహసీల్దార్ సుబ్బయ్య జారీ చేశారు. అయినా ఈ నెల 17న ఎమ్మార్పీఎస్ నేతలు సుబ్బయ్య, శ్రీను, వెంకట్రాయుడు, వెంకటరమణయ్య, స్థానిక ఎస్సీకాలనీకి చెందిన మురళి, చిరంజీవి సహకారంతో 96 మంది అక్రమంగా ప్రవేశించి నిర్మాణాలు చేసేందుకు యత్నించారు. వీరిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పోలీసులకు తహసీల్దార్ ఫిర్యాదు చేశారు. దీంతో వీరిపై కేసులు నమోదు చేశారు.

నిమ్మధరలు (కిలో)
పెద్దవి: రూ.92
సన్నవి: రూ.80
పండ్లు: రూ.40



పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ లైవ్ :	రూ.101
లేయర్ లైవ్	రూ.75
బ్రాయిలర్ చికెన్:	రూ.180
స్కిన్‌లెస్ చికెన్:	రూ.200
లేయర్ చికెన్:	రూ.128





చీటింగ్ కేసులో నిందితులకు జైలు

నెల్లూరు(లీగల్) : నకిలీ పేర్లతో సొసైటీని స్థాపించి ప్రజలను మోసగించారని నమోదైన కేసులో నేరం రుజువు కావడంతో ఇద్దరికి నాలుగేళ్ల జైలు శిక్ష, మరో ముగ్గురికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.యామిని మంగళవారం తీర్పు చెప్పారు. వారిలో వైఎస్సార్ జిల్లా, మైదుకూరు, బసవపురం గ్రామానికి చెందిన బైరి మారుతీప్రసాద్, మైదుకూరులోని రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన తిరువాయిపాటి రమేష్‌లకు నాలుగేళ్ల జైలు శిక్షతో పాటు రూ.20 వేల చొప్పున జరిమానా, నాగాలాండ్‌లోని దిమ్మాపూర్ ప్రాంతానికి చెందిన సెంథికుమ్లా, హైదరాబాద్‌కు చెందిన అప్పల మహేష్, ఆత్మకూరులోని రావకొల్లు గ్రామానికి చెందిన ఆత్మకూరు రాముకు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.20 వేల చొప్పున జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. సెంథికుమ్లాతో పాటు పై నిందితులందరూ మారు పేర్లతో 2011 ఆగస్టు 3న యూత్ అలైవ్ సొసైటీని స్థాపించారు. హైదరాబాద్‌తో పాటు కడప, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో పలువురు ఏజెంట్లను నియమించుకుని ప్రజల నుంచి నెలకు రూ.11 వేల చొప్పున మూడు నెలలు చెల్లిస్తే ఆరు నెలల అనంతరం కట్టిన రొఖ్ఖానికి మూడో వంతు చెల్లిస్తామని నమ్మించి రూ.కోట్ల నగదును వసూలు చేశారు. మొదట కొందరికి చెల్లించి అనంతరం అర్ధాంతరంగా సొసైటీని మూసివేసి పరారయ్యారు. దీంతో లబ్ధిదారుడు అరవ రమేష్ ఫిర్యాదు మేరకు నెల్లూరు సీబీడీ డీఎస్పీ కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కోర్టులో నిందితులపై చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణలో నిందితులపై నేరం రుజువు కావడంతో పై మేరకు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పీపీ అయ్యపరెడ్డి కేసు వాదించారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

నెల్లూరు(క్రైమ్) : పెళ్లైన రెండో రోజు నుంచే భర్త, అత్తింటి వారు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని ఓ వివాహిత మంగళవారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి కథనం మేరకు.. పడారుపల్లి కావేరినగర్‌కు చెందిన వెంకటశాంతి లక్ష్మికి గతేడాది మే 25న ఉదయగిరి మండలం ముసాయిపేటకు చెందిన వెంకటసుబ్బయ్యతో వివాహమైంది. వారి స్తోమతకు తగట్టుగా కట్నకానుకలు ఇచ్చారు. వివాహ అనంతరం 27న దంపతులు ముసాయిపేటకు వెళ్లారు. అదేరోజు రాత్రి భర్త, అత్తింటివారు ఆమెను ఓ గదిలో బంధించి నల్లగా ఉన్నావని, ఇచ్చిన బంగారం సరిపోలేదని, అదనంగా డబ్బులు తీసుకురావాలని హింసించారు. మరుసటిరోజు లక్ష్మి తండ్రిని పిలిపించి పుట్టింటికి పంపేశారు. లక్ష్మి తల్లిదండ్రులు పెద్ద మనుషుల సమక్షంలో రాజీ ప్రయత్నాలు చేసినా ఫలితం లేకుండాపోయింది. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు వెంకటసుబ్బయ్యతో పాటు అతని తల్లిదండ్రులు, సోదరి, ఆమె భర్తపై పోలీసులు వేధింపుల కేసు నమోదు చేశారు.

23న జాబ్‌మేళా

నెల్లూరు(మినీబైపాస్) : జిల్లా ఉపాధి కార్యాలయంలో మార్చి 23న జాబ్‌మేళా నిర్వహిస్తామని జిల్లా ఉపాధి అధికారి అందెల సురేష్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, మహేంద్ర షోరూమ్, చంద్ర బయో టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మార్కెటింగ్, రికవరీ ఎగ్జిక్యూటివ్స్, టెలీకాలర్స్ ఉద్యోగాలకు పదో తరగతి నుంచి డిగ్రీ వరకు, ఐటీఐ పూర్తి చేసిన 18 నుంచి 30 ఏళ్ల మధ్య వారు అర్హులని పేర్కొన్నారు.

ప్రొవిజినల్ మెరిట్ జాబితా విడుదల

నెల్లూరు(అర్బన్) : నగరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల, ప్రభుత్వ పెద్దాస్పత్రిలో ఇటీవల ప్రకటించిన నోటిఫికేషన్ ప్రకారం ఖాళీగా ఉన్న పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ప్రొవిజినల్ మెరిట్ జాబితాను మంగళవారం విడుదల చేశామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఎస్పీఎస్‌నెల్లూరు.ఏపీ.జీఓవీ.ఇన్/నోటీసు/రిక్రూట్‌మెంట్ అనే వెబ్‌సైట్‌లో తమ మెరిట్ జాబితాను పరిశీలించుకోవాలని సూచించారు. జాబితాపై ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 23, 24వ తేదీల్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

క్రీడల్లోనూ రాణించాలి

- ఎస్పీ విజయారావు

నెల్లూరు(క్రైమ్) : జర్నలిస్టులు వార్తల సేకరణతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎస్పీ సీహెచ్ విజయారావు సూచించారు. జర్నలిస్ట్స్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(జేశాప్) జిల్లా శాఖ నిర్వహించనున్న జిల్లాస్థాయి క్రికెట్ పోటీలకు సంబంధించిన టీషర్టులను పోలీసు కార్యాలయంలో మంగళవారం ఎస్పీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేశాప్ ఆధ్వర్యంలో ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు జరుగనున్న క్రికెట్ పోటీల్లో జర్నలిస్టులందరూ పాల్గొని క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో జేశాప్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వై.నరేష్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు ఎన్.నందకిశోర్, ఉపాధ్యక్షుడు ఎం.వెంకటరావు, కోశాధికారి జనార్దన్, సభ్యులు జార్జ్ పాల్గొన్నారు.

విశ్వసాయి ఎస్సార్కేలో 'ఎర్త్ అవర్' ర్యాలీ

నెల్లూరు (టౌన్) : విశ్వసాయి ఎస్సార్కే, లయన్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో 'ఎర్త్ అవర్' ఆవశ్యకతపై విద్యార్థులు నగరంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈనెల 25న రాత్రి విద్యుద్దీపాలను ఆర్పివేయాలంటూ కార్డులు, భూమి నమూనాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా విశ్వసాయి విద్యాసంస్థల చైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని తెలిపారు. లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ ప్రసాద్ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ కృష్ణమోహన్, ప్రిన్సిపల్ రఘురాం పాల్గొన్నారు.

వైద్యశాఖలో పోస్టుల భర్తీకి చర్యలు

నెల్లూరు(అర్బన్) : జిల్లా వైద్య, ఆరోగ్యశాఖలో నేషనల్ హెల్త్ మిషన్(ఎన్‌హెచ్‌ఎం)లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టినట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆత్మకూరు జిల్లా ఆస్పత్రిలో టెలీమెడిసిన్ విభాగంలో పనిచేసేందుకు ఒక పీడియాట్రిక్ డాక్టర్, అదే ఆస్పత్రిలోని డైస్ సెంటర్‌లో పనిచేసేందుకు మరొక పీడియాట్రిక్ డాక్టర్ పోస్టును, జనరల్ మెడిసిన్ డాక్టర్ పోస్టును భర్తీ చేస్తున్నామన్నారు. ఎంపికయ్యే డాక్టర్లకు నెలకు రూ 1,10,000 జీతం ఉంటుందన్నారు. ఆసక్తి గల డాక్టర్లు ఈనెల 22 నుంచి 27వ తేదీ లోపు సంతపేటలోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో వాకిన్ ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. దరఖాస్తులను ఎస్పీఎస్‌నెల్లూరు.ఏపీ.జీఓవీ.ఇన్/నోటీసు/రిక్రూట్‌మెంట్ అనే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు.

సెల్‌ఫోన్ల దొంగ అరెస్ట్

నెల్లూరు(క్రైమ్) : సెల్‌ఫోన్ చోరీలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్లితే.. ఈనెల 17, 18వ తేదీల్లో నగరంలోని వేర్వేరు చోట్ల సెల్‌ఫోన్ దొంగతనాలు జరిగాయి. వీటిపై పోలీసులు కేసు నమోదు చేశారు. చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ ఎ.సురేంద్రబాబు పర్యవేక్షణలో ఎస్సై ఎండీ హనీఫ్ తన సిబ్బందితో దర్యాప్తు చేపట్టారు. సీసీఫుటేజ్‌లు, బాధితులు చెప్పిన ఆధారాల మూలంగా నిందితుడు రూరల్ మండలం, పెనుబర్తి గ్రామానికి చెందిన పాతనేరస్తుడు తలారి మహేంద్రగా పోలీసులు గుర్తించారు. అతని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈనెల 20న ఎస్-2 థియేటర్ సమీపంలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారించగా అంజయ్య, వెంకటేశ్వర్లు అనే వ్యక్తుల వద్ద సెల్‌ఫోన్లను చోరీ చేశానని, మహేంద్ర, శివాజీలను కత్తులతో బెదిరించి సెల్‌ఫోన్లను దొంగలించినట్లు నేరం అంగీకరించారు. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసి నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని మంగళవారం కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు.

ముగ్గురు సీఐల బదిలీ

నెల్లూరు(క్రైమ్) : జిల్లాలో ముగ్గురు సీఐలను బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ డీఐజీ డాక్టర్ సీఎం త్రివిక్రమవర్మ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. సంతపేట ఇన్‌స్పెక్టర్ షేక్ అన్వర్‌బాషా రేంజ్ కార్యాలయానికి, బాపట్ల జిల్లా చుండూరు సీఐగా చేస్తున్న బి.కల్యాణ్‌రాజును సంతపేటకు, వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ కె.నరసింహరావును రేంజ్ కార్యాలయానికి, అక్కడున్న పి.వెంకట నారాయణను వేదాయపాళేనికి, నెల్లూరు రూరల్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటరెడ్డిని రేంజ్ కార్యాలయానికి అక్కడున్న పి.శ్రీనివాసరెడ్డిని రూరల్ స్టేషన్‌కు బదిలీ చేశారు. వీరు వెంటనే ఆయా ప్రాంతాల్లో రిపోర్టు చేసుకోవాలని డీఐజీ ఆదేశించారు.

సుపరిచితులే..

నెల్లూరు రూరల్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా నియమితులైన పి.శ్రీనివాసరెడ్డి జిల్లాకు సుపరిచితులే. 1996వ బ్యాచ్‌కు చెందిన ఆయన గతంలో జిల్లాలో ఎస్‌బి, నెల్లూరు రూరల్, గూడూరు రూరల్ సీఐగా పనిచేశారు. సంతపేట ఇన్‌స్పెక్టర్‌గా నియమితులైన బి.కల్యాణ్‌రాజు 1998వ బ్యాచ్‌కు చెందిన ఎస్సై. ఆయన గతంలో ఉదయగిరి, గూడూరు సీఐగా పనిచేశారు. వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్‌గా నియమితులైన పి.వెంకట నారాయణ 2007వ బ్యాచ్ ఎస్సై. ఆయన జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్‌లలో ఎస్సైగా పనిచేశారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్‌గా, దుగరాజపట్నం మెరైన్ సీఐగా పనిచేశారు.

ఇంటర్ పరీక్షలకు 729 మంది గైర్హాజరు

నెల్లూరు (టౌన్) : ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు మ్యాథ్స్ 2-ఏ, బోటనీ-2, సివిక్స్-2 పరీక్షలు మంగళవారం జరిగాయి. జిల్లా వ్యాప్తంగా జనరల్‌కు సంబంధించి 25,040 మంది విద్యార్థులకు 24,418 మంది హాజరయ్యారు. 622 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 1,685 మందికి 1,578 మంది హాజరు కాగా 107 మంది గైర్హాజరయ్యారు.







గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును. ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.